# ఎన్.బి.ఎఫ్.సి ల గురించి మీరు తెలుసుకోగోరిన సమగ్ర సమాచారం

ఆర్థిక సంస్థలలో డిపాజిట్ల సేకరణ కార్యకలాపాలు

ఎ) నిర్వచనములు

1. నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీ అంటే ఏమిటి?

నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీ (ఎన్‌బిఎఫ్‌సి) అనగా ఏదైనా కంపనీ (ఎ) కంపనీల చట్టం 1956 ప్రకారం రిజిస్టర్ కాబడి ఉండాలి (బి) దాని ప్రధాన వ్యాపారం రుణమంజూరు, వివిధ రకాలైన షేర్లలో, స్టాక్‌లలో, బాండ్లలో, డిబెంచర్లలో, సెక్యూరిటీలలో పెట్టుబడులు పెట్టటం, లీజింగ్, హైర్–పర్చేజ్, ఇన్సూరెన్సు వ్యాపారం, చిట్ వ్యాపారం అయి ఉండాలి మరియు (సి) దాని ప్రధాన వ్యాపారం ఏదైనా స్కీం క్రింద లేక ఏదైనా ఏర్పాటు ద్వారా డిపాజిట్లను ఒకే మొత్తంగా లేక వాయిదాలలో స్వీకరించడం అయిఉండాలి. ఏదైనా సంస్థ యొక్క ప్రధాన వ్యాపారం వ్యవసాయ సంబంధమైన కార్యకలాపాలతో కూడియున్నా, పారిశ్రామిక సంబంధ కార్యకలాపాలతో కూడియున్నా, ట్రేడింగా కార్యకలాపాలు లేక స్థిరాస్తుల అమ్మకాలు/ కొనుగోళ్ళు, కట్టడాలు అయితే అటువంటి సంస్థ నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీ పరిధిలోకి రాదు (ఆర్‌బిఐ చట్టం 1934 లోని సెక్షన్ 45 ఐ(సి)). ఇక్కడ ముఖ్యంగా గుర్తుంచుకోవలసిన విషయమేమంటే సెక్షన్ 45 ఐ(సి) లో తెలిపిన అప్పులు/అడ్వాన్సులతో కూడిన ఆర్థిక కార్యకలాపాలు కంపనీ యొక్క సొంత కార్యకలాపాలకోసం కాకుండా ఉండాలి. ఈ నిబంధన లేకుండా ఉంటే, కంపనీలన్నీ నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు అయి ఉండేవి.

2. వ్యవస్థాగత ప్రధాన్యత కలిగిన నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీలు అనగా ఏవి?

చివరిసారిగా ఆడిట్ కాబడిన ఆస్తులు, అప్పుల పట్టిక ప్రకారం ఏదైనా నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీ యొక్క ఆస్తుల విలువ రూ. 100 కోట్లు, ఆపైన ఉన్నట్లయితే సదరు కంపెనీని వ్యవస్థాగత ప్రాధాన్యత కలిగిన నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీగా గుర్తించవచ్చు. అటువంటి నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీల యొక్క కార్యకలాపాలు మనదేశ ఆర్థిక స్థిరత్వంపై ప్రభావం చూపడం వలన, ఈ విధమైన వర్గీకరణ అవసరమైనది.

బి. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (రిజర్వు బ్యాంకు) ద్వారా నియంత్రించబడుచున్న సంస్థలు

3. రిజర్వు బ్యాంకు అన్ని ఆర్థిక సంస్థలను నియంత్రిస్తుందా?

లేదు. కొన్ని ఆర్థిక వ్యాపారాలను నియంత్రించి పర్యవేక్షించడానికి చట్ట ప్రకారం ఏర్పరచిన విశేష నియంత్రణ సంస్థలు ఉన్నాయి. అవి ఏవనగా ఇన్సూరెన్స్ కంపెనీలకు ఐఆర్‌డిఎ, మర్చంట్ బ్యాంకింగ్

కంపెనీలకు,వెంచర్ క్యాపిటల్ కంపెనీలకు, స్టాకు బ్రోకింగ్ కంపనీలకు మరియు మ్యూచువల్ ఫండ్లకు సెక్యూరిటీస్ ఎక్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి), హౌజింగ్ ఫైనాన్స్ కంపెనీలకు నేషనల్ హౌజింగ్ బ్యాంకు (ఎన్‌హెచ్‌బి), నిధి కంపెనీలకు కంపనీ వ్యవహారాల శాఖ (డిసిఎ), మరియు చిట్‌ఫండ్ కంపనీలకు రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రణ సంస్థలుగా ఉన్నాయి. ఆర్థిక వ్యాపారం చేస్తూ ఇతర నియంత్రణ సంస్థల పర్యవేక్షణలో ఉన్న కంపనీలకు రిజర్వు బ్యాంకు వారు వారి పర్యవేక్షణ సంబంధ అవసరాల నుండి అనగా రిజిస్ట్రేషన్, ద్రవ ఆస్తుల నిల్వలను నిర్వహించటం, చట్టసంబంధమైన నిల్వలు మొదలైన వాటి నుండి ప్రత్యేకమైన మినహాయింపు ఇవ్వబడింది. కార్యకలాపాలు, వాటి సంబంధిత నియంత్రణ సంస్థల వివరాలు ఈ క్రింద తెలుపబడిన పటం ద్వారా తెలుసుకోవచ్చు (చార్ట్ 1).

4. ఎలాంటి ప్రత్యేకమైన ఆర్థిక కంపనీలపై రిజర్వుబ్యాంకు పర్యవేక్షణ ఉంటుంది?

రిజర్వు బ్యాంకు ఈ క్రింది వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్న నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీలపై నియంత్రణ మరియు పర్యవేక్షణ అధికారాలు కలిగి ఉంటుంది (1) అప్పులు ఇవ్వడం (2) షేర్లు, స్టాకులు, బాండ్లు మొదలైన వాటిని సేకరించడం, లేక (3) ఫైనాన్షియల్ లీజింగ్ లేక హైర్ పర్చేజ్ కార్యకలాపాలు నిర్వహించడం. రిజర్వు బ్యాంకు డిపాజిట్లు సేకరణ ప్రధాన వ్యాపారంగా గల కంపనీలని కూడా నియంత్రిస్తుంది. (ఆర్‌బిఐ చట్టం 1934 లోని సెక్షన్ 45 ఐ(సి)).

5. నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీల విషయంలో, అనగా 50-50 ప్రధాన వ్యాపార ప్రమాణం గల కంపనీల విషయంలో రిజర్వు బ్యాంకుకి గల అధికారాలు ఎట్టివి?

50-50 ప్రధాన వ్యాపార ప్రమాణం గల నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీలను రిజిష్టర్ చేయడానికి, వాటికి ప్రణాళికను సిద్ధం చేయడానికి, సూచనలు ఇవ్వడానికి, తనిఖీ చేయడానికి, నియంత్రించడానికి, పర్యవేక్షించడానికి, వాటిపై నిఘా ఉంచడానికి రిజర్వుబ్యాంకు చట్టం 1934 ప్రకారం ఆర్‌బిఐకి అధికారాలు కల్పించబడ్డాయి. రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా చట్టాన్ని గానీ మరియు ఆచట్టం క్రింద రిజర్వుబ్యాంకుచే ఇవ్వబడిన సూచనలను, ఉత్తర్వులను గానీ ఉల్లంఘించిన నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీలపై శిక్ష విధించే అధికారం రిజర్వుబ్యాంకుకు ఉంది. ఈ శిక్షలో భాగంగా రిజర్వుబ్యాంకుకు నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీలకు రిజర్వు బ్యాంకుచే ఇవ్వబడిన లైసెన్సులను రద్దు చేయడానికి, డిపాజిట్ల సేకరణను నిషేధించటానికి మరియు వాటి ఆస్తుల బదిలీకి లేక మూసివేత పిటిషన్లు దాఖలు చేయడానికి అధికారం ఉంటుంది.

సి. రిజర్వుబ్యాంకు వారి నియంత్రణలోకి రాని సంస్థలు.

6. ఇన్సూరెన్స్ కంపెనీలు, స్టాకు బ్రోకింగ్ కంపనీలు, మర్చంట్ బ్యాంకింగ్ కంపెనీలు, నిధి కంపెనీలు, హౌజింగ్ ఫైనాన్స్ కంపెనీలు మరియు చిట్‌ఫండ్ కంపనీలను రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఎందుకు నియంత్రించడం లేదు?

ఈ కంపనీలు ఇతర ఆర్థిక నియంత్రణ సంస్థల పరిధిలో ఉండడం వల్ల ద్వంద్వ నియంత్రణను నివారించేందుకు రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ద్వారా వీరికి రిజిస్ట్రేషన్ మరియు ఇతర నిబంధనల నుండి మినహాయింపు ఇవ్వడం జరిగింది.

7. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియాకి పైన పేర్కొన్న మినహాయింపబడిన నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీలపై చట్టబద్ధమైన అధికారం ఉంటుందా?

ఇది మినహాయింపుల పరిమితిపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు హౌజింగ్ ఫైనాన్స్ కంపనీలను తీసుకుంటే, వాటిని రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా నియంత్రణ నుండి మినహాయించడం జరిగింది. ఇతర సంస్థలు అనగా చిట్‌ఫండ్‌లు, నిధి కంపనీలు మ్యూచువల్ బెనిఫిట్ కంపనీలు, ఇన్సూరెన్స్ కంపనీలు, మర్చంట్ బ్యాంకింగ్ కంపనీలు, స్టాకుబ్రోకింగ్ కంపనీలు మొదలైనవాటికి రిజిస్ట్రేషను, ద్రవ ఆస్తుల నిర్వహణ మరియు చట్టపరమైన నిల్వల నుండి మినహాయింపు ఇవ్వడం జరిగింది. రిజర్వు బ్యాంకు వారు ఇతర ఆర్థిక నియంత్రణ సంస్థల నిర్దేశాలకు విరుద్ధంగా ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయరు. హౌజింగ్ ఫైనాన్స్ కంపెనీలు నేషనల్ హౌజింగ్ బ్యాంకు పరిధి లోను, ఇన్సూరెన్స్ కంపెనీలు ఐఆర్‌డిఎ పరిధిలోను, స్టాకు బ్రోకింగ్ కంపనీలు, మర్చంట్ బ్యాంకింగ్ కంపెనీలు, వెంచర్ క్యాపిటల్ కంపెనీలు, సంయుక్త పెట్టుబడి పథకాలు మరియు మ్యూచువల్ ఫండ్లు సెక్యూరిటీస్ ఎక్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా పరిధిలోను, నిధి కంపెనీలు కంపనీ వ్యవహారాల శాఖ లోను, చిట్‌ఫండ్ కంపనీలు సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోను నియంత్రించబడతాయి.

8. తమ వ్యాపారంలో భాగంగా ఆర్థిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న కంపెనీలను రిజర్వు బ్యాంకు నియంత్రిస్తుందా?

ఆర్థిక కార్యకలాపాలు తమ ప్రధాన వ్యాపారంగా గల కంపనీలను రిజర్వు బ్యాంకు పర్యవేక్షిస్తుంది మరియు నియంత్రిస్తుంది. వ్యవసాయ కార్యకలాపాలు నిర్వహిస్తున్న కంపనీలు, పారిశ్రామిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న కంపనీలు, వస్తువులను కొనుగోలు మరియు అమ్మకం వంటి కార్యకలాపాలు నిర్వహిస్తున్న కంపనీలు, సేవా విభాగంలో ఉన్న కంపనీలు, స్థిరాస్తుల కొనుగోలు మరియు అమ్మకం వంటి కార్యకలాపాలు నిర్వహిస్తున్న కంపనీలు మొదలైన వాటిని తమ ప్రధాన వ్యాపారంగాను మరియు కొద్దిపాటి ఆర్థిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న కంపనీలను రిజర్వుబ్యాంకు నియంత్రించదు.

9. 50–50 శాతం నిబంధనను పాటించకుండా డిపాజిట్లు సేకరించే కంపనీలు రిజర్వుబ్యాంకు వారి పరిధిలోకి వస్తాయా ?

ఏదైనా కంపనీ యొక్క ఆర్థికపరమైన ఆస్తులు తన మొత్తం ఆస్తుల్లో 50 శాతానికి మించి ఉండకపోతే మరియు ఈ ఆర్థిక ఆస్తులపై కనీసం 50 శాతం స్థూల ఆదాయం లభించనట్లయితే అలాంటి కంపనీ నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీగా పిలువబడదు. ఈ కంపనీల యొక్క ప్రధాన వ్యాపారం ఆర్థికేతర

కార్యకలాపాలు అనగా వ్యవసాయ కార్యకలాపాలు, పారిశ్రామిక కార్యకలాపాలు, వస్తువుల కొనుగోలు / అమ్మకాలు లేక స్థిరాస్తుల కొనుగోలు/ నిర్మాణం మొదలైనవి. అందువలన వీటిని నాన్-బ్యాంకింగ్ నాన్-ఫైనాన్షియల్ కంపనీలుగా పరిగణిస్తారు. నాన్-బ్యాంకింగ్ నాన్-ఫైనాన్షియల్ కంపనీల యొక్క డిపాజిట్ల సేకరణ కంపనీల డిపాజిట్ల సేకరణ నిబంధనలు, 1975 అనుగుణంగా ఉంటుంది. ఈ పథకాలను ఆరాష్ట్రాలలోని రిజిస్ట్రార్ ఆఫ్ కంపనీ నిర్వహిస్తారు.

డి. ప్రధాన వ్యాపారం ప్రమాణం (పిబిసి)

10. ఆర్థిక కార్యకలాపాల నిర్వహణ ‘‘ప్రధాన వ్యాపారం’’ అనగా ఏమి?

ఆర్థిక కార్యకలాపాలు ప్రధాన వ్యాపారంగా పరిగణించాలంటే కంపనీ యొక్క ఆర్థికపరమైన ఆస్తులు మొత్తం ఆస్తులల్లో 50 శాతానికి మించి ఉండి అట్టి ఆర్థికపరమైన ఆస్తులపై ఆదాయం కనీసం స్థూల ఆదాయంలో 50 శాతం కంటే మించి ఉండాలి. ఈ రెండు ప్రమాణాలను పాటించిన కంపనీలను రిజర్వుబ్యాంకు వారు నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీగా రిజిష్టరు చేస్తారు. రిజర్వుబ్యాంకు చట్టంలో ‘‘ప్రధాన వ్యాపారం’’ అనే పదానికి నిర్వచనం ఇవ్వలేదు. అయితే రిజర్వుబ్యాంకు ఈ ప్రమాణం ఎందుకు ఏర్పరిచిందంటే ప్రధానంగా ఆర్థిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న కంపనీలు తమతో రిజిష్టరు చేయించుకోవాలని అవి తమ నియంత్రణలో మరియు పర్యవేక్షణలో పనిచేయాలని రిజర్వుబ్యాంకు వారు ఇలా నిర్ధేశించారు. ఇతర వ్యాపార కార్యకలాపాలు, ఉత్పత్తిరంగం కార్యకలాపాలు, లేక పారిశ్రామిక కంపనీలు రిజర్వ్‌బ్యాంకు పరిధిలోకి రావు. ఆసక్తికరంగా ఈ పరీక్షను ప్రముఖంగా 50-50 పరీక్షగా పరిగణిస్తారు. ఏదైనా కంపనీ ఆర్థిక కార్యకలాపాలలో ఉన్నదో లేదో తెలుసుకోవడానికి ఈ పరీక్షను నిర్వహిస్తారు.

ఇ. రెసిడ్యూయరీ నాన్-బ్యాంకింగ్ కంపనీలు (ఆర్ఎన్‌బిసిలు)

11. రెసిడ్యూయరీ నాన్-బ్యాంకింగ్ కంపనీలు (ఆర్ఎన్‌బిసి) అంటే ఏమిటి? ఇవి ఇతర నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీల కంటే ఏ విధంగా భిన్నమైనవి?

రెసిడ్యూయరీ నాన్-బ్యాంకింగ్ కంపనీలు అంటే నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీలలో ఒకరకానికి చెందిన కంపనీలు. వీటి ప్రధాన వ్యాపారం ఏదైనా పథకం క్రింద లేదా ఏదైనా ఏర్పాటుపై లేక ఏదైనా ఇతర మార్గాల ద్వారా డిపాజిట్లు సేకరించడం. ఈ కంపనీలు పెట్టుబడులు, ఆస్తుల కొనుగోళ్లు, రుణ మంజూరి వంటి కార్యకలాపాలను నిర్వహించవు. డిపాజిట్ల సేకరణ పరంగా మరియు డిపాజిటర్ల నుండి సేకరించిన డబ్బును వినియోగించడం వంటి వాటిలో నాన్-బ్యాంకింగ్ కంపనీలతో పోల్చుకుంటే ఈ కంపనీల యొక్క విధివిధానాలు వేరుగా ఉంటాయి. కానీ ప్రస్తుతం రిజర్వుబ్యాంకు ఈ కంపనీలను డిపాజిట్లు సేకరించవద్దని, ఆర్ఎన్‌బిసిలుగా వ్యాపారాన్ని మూసివేయాలని ఆదేశించింది.

12. ఆర్ఎన్‌బిసిల డిపాజిట్ల సేకరణపై ఎలాంటి గరిష్ఠ పరిమితిని విధించలేదు. అప్పుడు సదరు డిపాజిట్లు ఎంతవరకు క్షేమం?

ఆర్ఎన్‌బిసిల డిపాజిట్ల సేకరణపై గరిష్ఠ పరిమితి లేదనేది సత్యం. అయితే ప్రతి ఆర్ఎన్‌బిసి వారివద్ద డిపాజిటు చేసిన మొత్తాన్ని ఆమోదించబడిన వాటిలో పెట్టుబడి పెట్టాలి. అంటే డిపాజిటర్ల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ కంపనీలు తమ వద్ద ఉన్న 100 శాతం డిపాజిటు మొత్తాన్ని అతి ద్రవ్య నిధిగాను, క్షేమంగా వుండేలా చూడాలి. అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సెక్యూరిటీలలోను షెడ్యూల్డు కమర్షియల్ బ్యాంకులలో ఫిక్స్‌డ్ డిపాజిట్లు గాను (ఎస్‌సిబి), డిపాజిటు సర్టిఫికేట్ల (ఎస్‌సిబి/ఎఫ్ఐ) మ్యూచ్యువల్ ఫండ్ల యూనిట్లలోనూ పెట్టుబడి పెట్టాలి.

13. డిపాజిటు వాయిదాలు క్రమం తప్పకుండా చెల్లించని పక్షంలో లేక చెల్లింపు నిలిపివేసిన పక్షంలో ఆర్ఎన్‌బిసిలు డిపాజిట్లు జప్తు చేయవచ్చా?

లేదు. రెసిడ్యుయరీ నాన్-బ్యాంకింగ్ కంపనీలు డిపాజిటర్ల యొక్క డిపాజిట్లను వాటిపై వచ్చే వడ్డీని, ప్రీమియంను, బోనస్‌ను మరియు ఏ ఇతరత్ర లాభాలను జప్తు చేయలేవు.

14. ఆర్ఎన్‌బిసిలు డిపాజిట్లపై ఎంత శాతం వడ్డీని చెల్లించాలి? సేకరించిన డిపాజిట్ల కాల పరిమితి ఎంత?

ఆర్ఎన్‌బిసిలు ఒకే మొత్తంగాను లేక నెలవారీగాను లేక ఎక్కువ కాలపరిమితితో సేకరించిన డిపాజిట్లపై కనీసం 5 శాతం వడ్డీని (ప్రతి సంవత్సరం చక్రవడ్డీతో) మరియు ప్రతిరోజు డిపాజిట్ పథకం క్రింద 3.5 శాతం వడ్డీని (ప్రతి సంవత్సరం చక్రవడ్డీతో) చెల్లించాలి. ఇచ్చట వడ్డీ అనగా ప్రీమియం, బోనస్ లేక ఆర్ఎన్‌బిసిలు డిపాజిటర్లకు ఇవ్వజూపే ఇతర ప్రయోజనాలు కలిసి ఉంటాయి. ఆర్ఎన్‌బిసిలు సేకరించే డిపాజిట్ల సేకరణ తేది నుంచి కనీస కాలపరిమితి 12 నెలలు గరిష్ట పరిమితి 84 నెలలు ఉండవచ్చు. అడగగానే తిరిగి చెల్లించే పద్ధతిపై డిపాజిట్లను స్వీకరించరాదు. అయితే ప్రస్తుతం ఉనికిలో ఉన్న రెండు ఆర్ఎన్‌బిసిలను (పీర్‌లెస్ మరియు సహారా ఇండియా ఫైనాన్షియల్ కార్పొరేషన్ లిమిటెడ్) డిపాజిట్లు సేకరణ నిలిపివేయమని, ఇప్పటికే సేకరించిన డిపాజిట్లను డిపాజిటర్లకు తిరిగి చెల్లించాలని మరియు తమ ఆర్ఎన్‌బిసి వ్యాపారం లాభదాయకంగా లేకపోవడంతో దానిని మూసివేయాలని రిజర్వుబ్యాంకువారు ఆదేశించారు.

ఎఫ్. డిపాజిట్లు డిపాజిట్లు సేకరించడానికి అర్హమైన /అనర్హమైన సంస్థలు మరియు సంబంధిత విషయాలపై నిర్వచనం.

15. డిపాజిట్లు అంటే ఏమిటి?

మూలధన రూపంలోను, భాగస్వామ్య వ్యాపారంలో భాగస్వాముల వాటాగా చెల్లించిన మూలధనం, సెక్యూరిటీ డిపాజిట్లు, ఎర్నెస్ట్ మనీ డిపాజిట్లు, వస్తువుల కొనుగోలుకు, సేవలు, లేక నిర్మాణం కోసం

ఇచ్చిన ముందస్తు సొమ్ము, బ్యాంకు నుంచి, ఇతర ఆర్థిక సంస్థల మరియు వడ్డీ వ్యాపారుల నుండి సేకరించిన రుణాలు, చిట్‌ఫండ్‌కు చందాలు తప్ప మరే ఇతర పద్ధతిలో నగదును సేకరించినా ఆ మొత్తాలను డిపాజిట్లు అంటారు.

16. ప్రజల నుండి న్యాయబద్దంగా ఏ సంస్థలు డిపాజిట్లు సేకరించవచ్చు?

బ్యాంకులు, కోఆపరేటివ్ బ్యాంకులు, డిపాజిట్లు సేకరించవచ్చు. రిజర్వుబ్యాంకు వారిచే డిపాజిట్లు సేకరణకై అనుమతి ఉన్న రిజిస్ట్రేషన్ సర్టిఫికేటు పొందిన నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపనీలు ప్రజల నుండి డిపాజిట్లు సేకరించవచ్చు. మరోలా చెప్పాలంటే రిజర్వుబ్యాంకు వారివద్ద రిజిస్ట్రేషన్ చేయించుకున్న నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీలన్నీ డిపాజిట్లను సేకరించడానికి అనుమతి లేదు. రిజర్వుబ్యాంకు వారివద్ద డిపాజిట్ స్వీకరణకై అనుమతివున్న రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ పొందిన నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీలు మాత్రమే డిపాజిట్లను స్వీకరించ వచ్చు . అయితే అ కంపేనిలు కూడా అనుమతించబడిన మొత్తాల మేరకు మాత్రమే డిపాజిట్లు స్వీకరించాలి. హౌజింగ్ ఫైనాన్స్ కంపనీలు డిపాజిట్లు సేకరించేందుకు ప్రత్యేకంగా అనుమతించబడ్డాయి. భారత ప్రభుత్వంలోని కంపనీల వ్యవహారాల మంత్రిత్వ శాఖచే అనుమతించబడి, కంపనీల చట్టంలోని డిపాజిట్ సేకరణ నిబంధనలకు అనుగుణంగా అనుమతింపబడిన కంపనీలు కూడా డిపాజిట్లను కొంత పరిమితి వరకు సేకరించవచ్చు. కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలు తమ సభ్యుల నుండి డిపాజిట్లు సేకరించవచ్చు, కానీ ప్రజల నుండి సేకరించరాదు. రిజర్వుబ్యాంకు వారు బ్యాంకులు, సహకార బ్యాంకులు మరియు నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీలు సేకరించిన డిపాజిట్లను మాత్రమే నియంత్రిస్తారు.

ఇతర సంస్థలు ప్రజల నుండి డిపాజిట్లను సేకరించడానికి చట్టపరంగా అనుమతి లేదు.

నమోదుకాని సంస్థలు అనగా వ్యక్తులు, భాగస్వామ్య సంస్థలు, మరియు ఇతర వ్యక్తుల సమూహాలకు డిపాజిట్ల సేకరణ ప్రధాన వ్యాపారంగా నిర్వహించడానికి అనుమతి లేదు. అటువంటి నమోదు కాని సంస్థలు ఆర్థికపరమైన వ్యాపారాన్ని నిర్వహిస్తున్నప్పటికీ డిపాజిట్ల సేకరణకు అనుమతింపబడరు.

17. ఆర్‌బిఐ వద్ద రిజిస్ట్రేషన్ కాబడిన అన్ని నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీలు డిపాజిట్లు స్వీకరించవచ్చా? ఆర్‌బిఐ నుండి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందటం అంటే కంపనీలు డిపాజిట్లను సేకరించడానికి అనుమతించబడినట్లు భావించవచ్చా?

కూడదు, పైన తెలిపిన విధంగా ఆర్‌బిఐతో రిజిస్ట్రేషన్ కాగానే స్వయంచాలకంగా నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీలు డిపాజిట్లు సేకరించలేవు. రిజర్వుబ్యాంకు ఏదైనా నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీ డిపాజిట్లను సేకరించాలంటే అందుకు ప్రత్యేకంగా అనువమతి ఇస్తుంది. ఈ అనువమతి నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీ యొక్క మూడు సంవత్సరాల పనితీరు చూసిన తర్వాత జారీచేస్తారు. నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీకి జారీ చేయబడిన రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్‌లో డిపాజిట్ల సేకరణకు సంబంధించిన అనుమతిని ప్రత్యేకంగా చూపడం జరుగుతుంది. ప్రజా విధానపరంగా బ్యాంకులు మాత్రమే

డిపాజిట్లు సేకరించడానికి అర్హులని రిజర్వుబ్యాంకు వారు నిర్ణయం తీసుకున్నారు. అందువలన 1997 వ సంవత్సరం నుండి ప్రజల నుండి డబ్బు సేకరించడానికి నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీలకు రిజర్వుబ్యాంకు వారు సర్టిఫికెట్ ఆఫ్ రిజిస్ట్రేషన్ జారీ చేయడం లేదు.

18. నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీలు డిపాజిట్లు సేకరించడాన్ని ఆర్‌బిఐ వారు ఎందుకు అంతగా నియంత్రిస్తున్నారు.

ఏ ఆర్థిక సంస్థపై చేసే పర్యవేక్షణలోనైనా రిజర్వ్ బ్యాంకు ముఖ్యంగా చూసేది డిపాజిటర్ల క్షేమాన్ని. షేర్లలో పెట్టుబడి పెట్టి తద్వారా ఎదురయ్యే లాభ నష్టాలని గానీ ప్రమోటర్స్‌తో లాభంగా పంచుకొనే పెట్టుబడిదారు వలె కాక డిపాజిటరు ఆర్థిక సంస్థల వద్ద నమ్మకంతో తమ సొమ్మును డిపాజిటు చేస్తారు. ఆర్థిక సంస్థలపై నియంత్రణ విషయంలో డిపాజిటర్ల సంక్షేమం అతి ముఖ్యమైనది. బ్యాంకులు ఎంతగానో నియంత్రించబడే ఆర్థిక సంస్థలు. ఏదైనా బ్యాంకు మూతపడే స్థితికి వచ్చి డిపాజిటరు యొక్క సొమ్మును చెల్లించని పక్షంలో డిపాజిట్ ఇన్సూరెన్సు మరియు క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషను వారు గరిష్ఠంగా డిపాజిటరుకు ఒక లక్ష రూపాయలను చెల్లిస్తారు.

19. రిజర్వు బ్యాంకు వారు డిపాజిట్ల సేకరణకు ప్రత్యేకంగా అనుమతించిన నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీలు ఏవి?

రిజర్వుబ్యాంకు వారు తమ అధికార వెబ్‌సైట్ www. rbi.org.in లో డిపాజిట్ల సేకరణ కొరకు చెల్లుబాటుగల రిజిస్ట్రేషన్ సర్టిఫికెటు ద్వారా తాము అనుమతించిన నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీల చిట్టాను పొందుపరిచారు www. rbi.org.in–సైట్ మ్యాప్-ఎన్బీఎఫ్‌సి లిస్ట్ –డిపాజిట్ టేకింగ్ ఎన్బీఎఫ్‌సిల పేర్లు. ఒక్కొక్కప్పుడు కొన్ని కంపనీలు డిపాజిట్ల సేకరణపై తాత్కాలికంగా నిషేధింపబడతాయి. రిజర్వు బ్యాంకు వారు ఈ విధంగా తాత్కాలిక నిషేధానికి గురయిన నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీల చిట్టాను కూడా పొందుపరుస్తారు. ఈ రెండు చిట్టాలను రిజర్వుబ్యాంకు వారు ఎప్పటికప్పుడు సవరిస్తారు. నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీలలో డిపాజిట్లు చేయదలచిన ప్రజలకు ముందుగా ఈ రెండు చిట్టాలను పరిశీలించుకోవలసినదిగా సూచించడమైనది.

20. సహకార క్రెడిట్ సొసైటీలు ప్రజలనుండి డిపాజిట్లు సేకరించవచ్చా?

కూడదు. సహకార క్రెడిట్ సొసైటీలు సాధారణ ప్రజలనుండి డిపాజిట్లను సేకరించకూడదు. వారు తమ సభ్యుల నుండి మాత్రమే డిపాజిట్లను సేకరించవచ్చు. అది కూడా ఆ సొసైటీల నిబంధనావళి ప్రకారం పరిమితికి మించకుండా డిపాజిట్లు సేకరించుకోవచ్చు.

21. వేతనదారుల సొసైటీగా ఏర్పడి ప్రజల నుండి డిపాజిట్లు స్వీకరించవచ్చా ?

కూడదు. ఈ సొసైటీలు వేతనం పొందే ఉద్యోగుల కొరకు ఏర్పడినవి అందువలను వీరు తమ సభ్యుల నుండి మాత్రమే డిపాజిట్లు స్వీకరించవచ్చు. సాధారణ ప్రజల నుండి డిపాజిట్లు సేకరించరాదు.

22. రిజర్వుబ్యాంకు వారు తమవద్ద రిజిస్ట్రేషన్ చేసుకోకుండా అనధికారికంగా డిపాజిట్లను స్వీకరిస్తున్న కంపనీలను, లేక రిజర్వుబ్యాంకు వద్ద రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందకుండా రుణమంజూరు మరియు పెట్టుబడి కార్యకలాపాలు నిర్వహిస్తున్న నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీలను ఎలా గుర్తిస్తుంది?

రిజర్వు బ్యాంకు వారు ప్రధానంగా ప్రజలనుండి అందే ఫిర్యాదులు మరియు వారు తెలిపే ఇబ్బందులు ద్వారా, పరిశ్రమ వర్గాల నుండి, ఈ కంపనీల యొక్క చట్టపరమైన ఆడిటర్ల ద్వారా అందే ప్రత్యేక నివేదికల ద్వారా, తమవద్ద రిజిస్ట్రేషన్ చేసుకోకుండా అనధికారికంగా డిపాజిట్లను స్వీకరిస్తున్న కంపనీలను, లేక రిజర్వుబ్యాంకు వద్ద అనుమతి పొందకుండా రుణమంజూరు మరియు పెట్టుబడి కార్యకలాపాలు నిర్వహిస్తున్న నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీలను గుర్తిస్తుంది. ఇంకా, వార్తాపత్రికల ద్వారా, తమ ప్రాంతీయ కార్యాలయాల ద్వారా లభించే సమాచారం మరియు ఇతర మార్గాల ద్వారా లభించే మార్కెట్ ఇంటెలిజెన్సు ద్వారా ఈ సమాచారాన్ని రిజర్వు బ్యాంకు తెలుసుకోగలుగుతుంది.

ఇంతేకాకుండా, ఆర్‌బిఐ వారు తమ అన్ని ప్రాంతీయ కార్యాలయాలలో ఆర్థిక రంగ నియంత్రణ సంస్థల మధ్య సమన్వయం కోసం రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీ (ఎస్ఎల్‌సిసి)ని ఏర్పాటు చేసారు. ఈ సమన్వయ కమిటీలో రాష్ట్రప్రభుత్వంలోని హోమ్ మరియు న్యాయశాఖాధికారులు, రిజిస్ట్రార్ ఆఫ్ కంపనీస్, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖా ప్రాంతీయ సంచాలకులు, నేషనల్ హౌజింగా బ్యాంకు, సెబి, రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ మరియు ఐసిఎఐ వారు సభ్యులుగా ఉంటారు. ఈ సమన్వయ కమిటీ ప్రతి ఆరు నెలలకొకసారి సమావేశమై అనుమతి లేకుండా కొనసాగుతున్న ఆర్థిక సంస్థల కార్యకలపాలకి సంబందించిన సమాచారాన్ని ఒకరికొకరు తెలుపుకొంటారు.

23. రిజిష్టరు కాబడిన నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థలతో సంబంధం ఉన్న/లేని యాజమాన్య సంస్థలు / భాగస్వామ్య సంస్థలు ప్రజలనుండి డిపాజిట్లు స్వీకరించవచ్చా?

కూడదు. యాజమాన్య సంస్థలు మరియు భాగస్వామ్య సంస్థలు నమోదుకాని సంస్థలు. అందువలన ఆ సంస్థలు ఆర్‌బిఐ చట్టం 1934 ప్రకారం ప్రజల నుండి డిపాజిట్లు స్వీకరించడానికి నిషేధింపబడ్డాయి.

24. అనేక నగల దుకాణాల వారు ప్రజల నుండి వాయిదాలలో డబ్బులు సేకరిస్తుంటారు. ఇది డిపాజిట్ల సేకరణ కిందకు వస్తుందా?

భవిష్యత్తులో నగలను అందించడానికి ముందస్తు చెల్లింపా, లేక డిపాజిట్టు మొత్తాన్ని వడ్డీతో కలిపి గడువు తేదీనాడు తిరిగి చెల్లించడానికి అంగీకరించారా అనే దానిపై ఇది ఆధారపడి ఉంటుంది. నగల దుకాణాల వారు కాంట్రాక్టు గడువు పూర్తికాగానే నగలను అందించడానికి వాయిదాలలో సేకరించిన సొమ్ము డిపాజిట్టుగా పరిగణింపబడదు. సేకరించిన డబ్బును తిరిగి వడ్డీతో చెల్లించే పద్దతిపై నగల దుకాణాల వారు డబ్బును స్వీకరిస్తే అది డిపాజిట్టుగా పరిగణింపబడుతుంది.

25. నమోదు కాని అటువంటి సంస్థలు ప్రజల నుండి డిపాజిట్లు స్వీకరిస్తే ఎలాంటి చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. ? ప్రజల నుండి డిపాజిట్ల స్వీకరణకు అనుమతి లేని నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థలు వారి ప్రమోటర్ల ద్వారా ఏర్పాటు కాబడిన యాజమాన్య సంస్థలు, భాగస్వామ్య సంస్థల ద్వారా ప్రజల నుండి డిపాజిట్లు స్వీకరించవచ్చా?

ఇలాంటి నమోదుకాని సంస్థలు ప్రజల నుండి డిపాజిట్లు స్వీకరిస్తే చట్టపరంగా క్రిమినల్ శిక్షకు గురి అవుతాయి. నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థలు నమోదుకాని సంస్థలతో అనుబంధాన్ని ఆర్‌బిఐ నిషే దించింది. ఆర్‌బిఐ చట్టానికి వ్యతిరేకంగా డిపాజిట్లు స్వీకరిస్తున్న యాజమాన్య సంస్థలు / భాగస్వామ్య సంస్థలతో నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థలు అనుబంధాన్ని కొనసాగిస్తే వారు క్రిమినల్ చట్ట ప్రకారం లేక రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించే ప్రొటక్షన్ ఆఫ్ ఇంటరెస్ట్ ఆఫ్ డిపాజిటర్స్ (ఆర్థిక సంస్థలలో) చట్టం ప్రకారం శిక్షించబడతారు.

26. ఆర్థిక సంస్థలు రుణ మంజూరి మరియు పెట్టుబడులు పెట్టటం ప్రధాన వ్యాపారం కలిగి రిజర్వుబ్యాంకు నుండి రిజిస్ట్రేషన్ సర్టిఫికెటు పొందకుండా వున్నట్లయితే ఎలాంటి చర్యలు తీసుకోవచ్చు?

రిజర్వుబ్యాంకుతో రిజిస్ట్రేషన్ చేయించుకోవలసివున్న నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీలు రిజిస్ట్రేషన్ చేసుకోకుండా నాన్–బ్యాంకింగ్ కార్యకలాపాలు, అనగా రుణమంజూరి, పెట్టుబడులు మరియు డిపాజిట్ల సేకరణ వ్యాపారాన్ని కొనసాగించినట్లయితే రిజర్వు బ్యాంకు ఆ కంపనీలపై జరిమానాను విధించవచ్చు లేదా అపరాధ రుసుమును విధించవచ్చు లేదా వాటిని న్యాయస్థానంలో ప్రాసిక్యూట్ చేయవచ్చు. ఆర్‌బిఐ వారి వెబ్‌సైట్‌లో అనుమతి పొందిన నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీల చిట్టాలో లేని ఏదైనా కంపనీ నాన్–బ్యాంకింగ్ కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు ప్రజల దృష్టికి వస్తే వారు దగ్గరలోని రిజర్వు బ్యాంకు ప్రాంతీయ కార్యాలయానికి ఫిర్యాదు చేయాలి. అలాంటి కంపనీలపై ఆర్‌బిఐ చట్టం 1934 కు వ్యతిరేకంగా చట్టవ్యతిరేక కార్యకలాపాలు కొనసాగిస్తున్నందుకు తగిన చర్య తీసుకోవడం జరుగుతుంది.

27. నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీల వారు తమ రుణగ్రస్తుల నుండి అధిక వడ్డీ రేటు వసూలు చేస్తున్నారు. నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీలు తమ రుణగ్రస్తులకు అందించే రుణాలపై విధించే వడ్డీ రేట్లపై ఏదైనా పరిమితి ఉంటుందా?

ఆర్థిక సంస్థలు (నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ మైక్రో ఫైనాన్స్ సంస్థలు మినహా) రుణగ్రస్తులకు విధించే వడ్డీ రేట్లపై నియంత్రణను రిజర్వుబ్యాంకు తొలగించింది. నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీ మరియు రుణగ్రహీతులు కుదుర్చుకొనే ఒప్పందంలోని నియమాల ఆధారంగా వడ్డీ రేట్లను వసూలు చేస్తారు. అయితే నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీలు తాము వసూలు చేయతలపెట్టిన వడ్డీరేటుని దరఖాస్తులోను మరియు రుణమంజూరి పత్రంలోను విధిగా తెలిపి రుణగ్రహీతలకు అర్థం అయ్యేలా తెలియచేయాలి.

28. తాము రిజర్వుబ్యాంకు వారి నియంత్రణ క్రింద ఉన్నట్లు తప్పుడు సమాచారాన్ని అందించే వ్యక్తులు/ ఆర్థిక సంస్థలపై ఎలాంటి చర్యలు తీసుకోవచ్చు?

ప్రజల నుండి డిపాజిట్లు వసూలు చేసేందుకు తాము రిజర్వుబ్యాంకు వారి నియంత్రణలో ఉన్నట్లు తప్పుడు సమాచారాన్ని అందించి ప్రజలను మభ్యపెట్టే ఆర్థిక సంస్థలు లేక నమోదు కాని సంస్థలపై భారత శిక్షాస్మృతి (IPC)ప్రకారం శిక్షకై చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఇలాంటి సంస్థలపై ప్రజలు తమ వద్ద ఉన్న సమాచారాన్ని దగ్గరలోని రిజర్వు బ్యాంకు కార్యాలయానికి మరియు పోలీసు స్టేషన్‌కి తెలియజేయాలి.

29. చిట్‌ఫండ్లు డబ్బును సేకరించడానికి మరియు డిపాజిట్ల సేకరణకి మధ్య ఉన్న తేడా ఏమిటి?

రిజర్వుబ్యాంకు చట్టం 1934 లో ''డిపాజిట్లు'' అను పదానికి నిర్వచనాన్ని చెప్పటం జరిగింది. ఈ నిర్వచనం ప్రకారం మూలధనం రూపంలోగానీ, బ్యాంకులు మరియు ఇతర ఆర్థిక సంస్థల ద్వారా డబ్బులు తీసుకోవడం గానీ, సెక్యూరిటీ డిపాజిటు, ఎర్నెస్ట్ మనీ రూపంలో డబ్బులు తీసుకోవడం గానీ, వస్తువుల కొనుగోలుకు లేదా సేవలకై అడ్వాన్సులుగా డబ్బు తీసుకోవడం గానీ మరియు చిట్‌ఫండ్ చందాలు ద్వారా తప్ప వేరేగా పొందిన మొత్తాలు అంటే రుణం రూపంలో గానీ లేక ఇతర రూపాలలో సేకరించిన మొత్తాలు గానీ డిపాజిటుగా పరిగణిస్తారు. చిట్ల వ్యాపారంలో సభ్యులు సొమ్ము వాయిదాలలో చెల్లిస్తారు, వారీలుగా ఒక్కొక్కరికి చిట్ సొమ్ము అందుతుంది. చందాల రూపంలో వసూలు చేసిన సొమ్మును ఈ నిర్వచనం నుండి మినహాయిస్తారు. వీటిని డిపాజిటుగా పరిగణించరు. చిట్‌ఫండ్ సంస్థలు పైన తెలిపిన విధంగా చందాలు వసూలు చేయవచ్చు, కానీ ఆగస్టు 2009 నుండి డిపాజిట్లు సేకరణ విషయంలో రిజర్వుబ్యాంకుచే నిషేధింపబడ్డాయి.

30. రుణమంజూరు మరియు పెట్టుబడి కార్యకలాపాలు కొనసాగిస్తున్న రిజిష్టరు కాబడిన నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీలు (డిపాజిట్లు స్వీకరించని కంపనీల జాబితా) చిట్టాలు ఎక్కడ చూడవచ్చు?

చెల్లుబాటులో వున్న రిజిస్ట్రేషన్ సర్టిఫికెటు కలిగి రుణ మంజూరు మరియు పెట్టుబడి కార్యకలాపాలు నిర్వహిస్తున్న, కాని డిపాజిట్లు స్వీకరించని నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీలు జాబితాను ఆర్‌బిఐ వారి వెబ్‌సైట్ www. rbi.org.in లో పొందవచ్చు. www.rbi.org.in - Site Map - NBFC list - List of NBFCs not accepting public deposits.

జి. డిపాజిటర్ల పరిరక్షణ విషయములు:

31. నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీలలో డిపాజిట్ చేసే ముందు డిపాజిటర్లు ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి?

డిపాజిటర్లు నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీలలో డబ్బులు డిపాజిట్ చేసే ముందు ఈ క్రింది జాగ్రత్తలు తీసుకోవాలి.

i. నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీ ఆర్‌బిఐ తో రిజిస్ట్రేషన్ అయినదో లేదో మరియు డిపాజిట్ల సేకరణకు అనుమతి పొందినదో లేదో తెలుసుకోవాలి. డిపాజిట్ల సేకరణకు అర్హులైన నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీల జాబితాను ఆర్‌బిఐ వారి వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. ఆర్‌బిఐ.ఓఆర్‌జి.ఇన్ సైట్ మ్యాప్–ఎన్‌బిఎఫ్‌సి లిస్ట్ లో పొందవచ్చు. అంతేకాక చాప్టర్ 3బి, 3సి లో నిషేధ ఉత్తర్వులకు గురి అయిన కంపనీలు, మూసివేతకు పిటిషన్ల క్రిందవున్న కంపనీలు మరియు చట్టపరమైన కేసులలో ఉన్న కంపనీల సమాచారం తెలియజేయబడింది. ఈ వివరాలు చూసి వారు డిపాజిట్ చేయబోయే కంపెనీలు ఇందులో లేవని నిర్ధారించుకోవాలి.

ii. రిజర్వ్ బ్యాంక్ చేత జారీ చేయబడిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను ( సి ఒ ఆర్ ) ఎన్‌బి ఎఫ్‌సి వారి వెబ్‌సైట్‌పై ప్రముఖంగా ప్రదర్శించవలసి ఉంటుంది. ఈ సర్టిఫికెట్‌లో ముఖ్యంగా ఎన్‌బి ఎఫ్‌సి డిపాజిట్లను అనుమతించుటకు గాను ఆర్‌బిఐ నుంచి అనుమతి పొందినది అని ప్రదర్శించవలిసి వుంటుంది. డిపాజిటర్లు తప్పనిసరిగా సర్టిఫికెట్‌ను పరీక్షించుకొని ఎన్ బి ఎఫ్ సి డిపాజిట్లను పొందుటకు అనుమతింపబడినదీ లేనిది పరిశీలించుకోవలెను.

iii. ఎన్ బి ఎఫ్ సి డిపాజిటర్‌కి అత్యధికంగా చెల్లించు వడ్డీ రేటు 12.5% కు మించకూడదు. స్థూల ఆర్థిక పరిస్థితులకు అనుకూలంగా అనుసరించి రిజర్వు బ్యాంక్ సదరు వడ్డీ రేట్లను మార్పు చేస్తుంది. సదరు వడ్డీ రేట్లలో మార్పులను రిజర్వు బ్యాంక్ వెబ్‌సైట్ – సైట్ మ్యాప్ – ఎన్ బి ఎఫ్ సి లిస్ట్ – ఎఫ్ ఎ క్యూ ద్వారా ప్రచురిస్తు ఉంటుంది.

iv. డిపాజిటర్ కంపెనీతో జమచేసిన ప్రతి మొత్తం నకు తగు విధంగా రశీదును పొందుటకు తప్పక అడుగవలెను. సదరు రశీదును కంపెనీ యొక్క అధీకృత అధికారి తగు విధంగా సంతకము చేయవలెను మరియు అ రశీదు తప్పనిసరిగా డిపాజిట్ తేది, డిపాజిటర్ పేరును, డిపాజిట్ మొత్తం నెంబర్ మరియు అక్షరాలా తెలుపుతూ, చెల్లించబడు వడ్డీ రేటు, మేచ్యూరిటి తేది మరియు మొత్తం మొదలగు అన్ని వివరాలను కలిగి ఉండవలెను.

32. అత్యధిక వడ్డీ రేట్లు ఇస్తామని ఆశ చూపించే పథకాల నుంచి ప్రజలు తమ డబ్బును నష్టపోకుండా వారించు కొనేందుకు ఎటువంటి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి?

పెట్టుబడులపై అత్యధిక వడ్డీ రేట్లను అందించే పథకములలో పెట్టుబడి పెట్టుటకు ముందుగా పెట్టుబడుదారులు ఆ సంస్థ ఏదో ఒక ఆర్థిక రంగ నియంత్రణ సంస్థలతో రిజిస్టర్ అయినదీ లేనిదీ తెలుసుకోవాలి, మరియు ఆ సంస్థ నిధులను డిపాజిట్లు లేదా వేరే రూపంలో పొందుటకు గాను అనుమతింపబడినదీ లేనిదీ నిర్ధారించుకోవాలి. పెట్టుబడిదారులు ఒక సంస్థ తమకు ఆఫర్ చేస్తున్న వడ్డీ రేట్లు మరియు డిపాజిట్లుపై వడ్డీ రేట్లు అధికంగా ఉన్నది లేనిది తప్పనిసరిగా పరిశీలన చేసుకోవలెను. నిధులు సేకరించిన సంస్థ తాము చేసిన హామి మొత్తం కంటే ఎక్కువ పొందనట్లయితే పెట్టుబడిదారునకు తన హామి ప్రకారం సొమ్మును చెల్లించలేదు. అధిక రిటర్న్‌లను పొందుటకు కంపెనీ తన పెట్టుబడులపై ఎక్కువ రిస్క్‌ను

తీసుకోవలసి ఉంటుంది. ఎంత ఎక్కువ రిస్క్ ఉంటుందో అంత ఎక్కువ స్పెక్యులేషన్‌తో తన పెట్టుబడులపై నిర్ణయము తీసికోవలసి ఉంటుంది. దాని ఫలితంగా ఖచ్చితమైన రిటర్న్ పొందే అశకాశం వుండదు. అందుకే, ప్రజలు వారికి వారు ముందు జాగ్రత్తగా హెచ్చరించుకోవాల్సినది ఏమంటే అధిక వడ్డీ ఇవ్వ చూపే పథకములలో అధికంగా నష్టపోవుటకు ఎక్కువగా అవకాశముంటుందని.

33. ఆర్ బి ఐ ఎన్ బి ఎఫ్ సి ల చేత సేకరించబడిన డిపాజిట్లను తిరిగి చెల్లించుటకు హామి ఇస్తుందా ?

లేదు. ఎన్ బి ఎఫ్ సి లకు డిపాజిట్ల స్వీకరించుటకు అధికారము కల్పించినప్పటికి తిరిగి చెల్లింపులకు రిజర్వుబ్యాంకు హామి ఇవ్వదు. అయితే పెట్టుబడిదారులు మరియు డిపాజిటర్లు ఒక ఎన్‌బి ఎఫ్ సి తో డిపాజిట్ చేసేటప్పుడు తగిన సమాచారాన్ని గ్రహించి తద్వారా నిర్ణయాలను తీసుకోవలెను.

34. ఒక వేళ ఎన్ బి ఎఫ్ సి అసలు మొత్తంను మరియు దానిపై వడ్డీని తిరిగి చెల్లించుటలో విఫలమైనప్పుడు డిపాజిటర్ ఎలాంటి చర్య తీసుకోవచ్చు?

ఒక వేళ ఆర్ బి ఐ చేత రిజిస్టరు చేయబడిన ఎన్.బి.ఎఫ్.సి. సంస్థ డిపాజిటర్ల డబ్బును తిరిగి చెల్లించనప్పుడు, సదరు డిపాజిటర్ ఆ ఎన్.బి.ఎఫ్.సి.పై దగ్గరలోని రిజర్వు బ్యాంక్ యొక్క ప్రాంతీయ కార్యాలయము లో ఫిర్యాదు చేయవచ్చును. అంతేకాకుండా డిపాజిటర్ వారి యొక్క డబ్బును తిరిగి పొందుటకు కంపెనీస్ యాక్టు , 1956 క్రింద కంపెనీ లా బోర్డును కూడా ఆశ్రయించవచ్చును లేదా సివిల్ కోర్టు లేదా కన్సూమర్ డిస్ప్యూట్స్ రిడ్రెస్సల్ ఫోరంలను ఆశ్రయించవచ్చును. ఇలాంటి బాధితులు స్టేట్ పోలీసు అధికారులకు / రాష్ట్ర పోలీసు శాఖలో ఉన్నటువంటి ఆర్థిక నేరాల విభాగమునకు ఫిర్యాదు చేయవచ్చును. కొన్ని రాష్ట్రాలు డిపాజిటర్ల శ్రేయస్సుకై ''ప్రొటెక్షన్ ఆఫ్ ఇన్టెస్ట్ ఆఫ్ డిపాజిటర్స్ (ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్‌లో)'' అనే చట్టం చేశాయి. ఆ చట్టం ద్వారా ఆయా సంస్థల ఆస్తులను జప్తు చేసి వాటి నుంచి డిపాజిటర్లకు చెల్లింపులను చేసేవిధంగా ఆ రాష్ట్రాలకు అధికారాలు వుంటాయి.

35. మినహాయింపు పొందిన ఎన్‌బిఎఫ్‌సిలు డిపాజిట్లను స్వీకరించవచ్చునా/కలిగి వుండవచ్చునా?

కూడదు. ఆర్ బి ఐ యాక్టులోని నిబంధనలు నుంచి లేదా దాని యొక్క నిర్ధేశాలు నుంచి మినహాయించబడిన ఎన్ బి ఎఫ్ సిలు ప్రజల నుండి సదరు డిపాజిట్లను స్వీకరించలేవు/కలిగిఉండలేవు. ఎందుకంటే ఆ సంస్థలకు మినహాయింపు మంజూరు చేయటంకోసమే పెట్టిన షరతులలో అవి డిపాజిట్లు స్వీకరించకూడదనే/కలిగి ఉండరాదనే షరతు కూడుకున్నది. అయితే నేషనల్ హౌజింగ్ బ్యాంక్ (NHB)నిబంధనలు అనుమతించినంతమేరకు హౌజింగ్ ఫైనాన్స్ కంపనీలు (HFC)డిపాజిట్లు స్వీకరించవచ్చు .

36. ఎన్ బి ఎఫ్ సి డిపాజిటర్ల ప్రయోజనాల రక్షణార్థం ఆర్ బి ఐ ఏమి చేస్తోంది?

డిపాజిట్ల సేకరణపీద ఆర్ బి ఐ విస్తారంగా నియమ నిబంధనలను జారీచేసినది. ఎంతమేరకు డిపాజిట్లు తీసుకోవచ్చో, డిపాజిట్ల సేకరణకై తప్పనిసరి అయిన క్రెడిట్ రేటింగ్, డిపాజిటర్లకు తిరిగి చెల్లింపుల

నిమిత్తం తప్పనిసరి అయిన లిక్విడ్ ఎసెట్స్ నిర్వహణ, డిపాజిట్స్ రిజిస్టర్స్ నిర్వహించు విధానము, ఇచ్చే రుణాల/చేసే పెట్టుబడులలో పరిమితులు, తగు విధమైన మూల ధన నిర్వహణతో సహా సరియైన నియమ నిబంధనలు మరియు ఎన్ బి ఎఫ్ సి ల తనిఖీ, ఇంకా ఇతర పాలన చర్యల ద్వారా ఎన్ బి ఎఫ్ సి ల పనితీరు సక్రమంగా ఉండేలా ఆర్‌బిఐ చర్యలు చేపడుతుంది. ఒక వేళ బ్యాంక్ తనిఖీ ద్వారా లేదా ఏదైనా ఎన్ బి ఎఫ్ సి ఆడిట్ ద్వారా లేదా ఫిర్యాదుల ద్వారా లేదా మార్కెట్ ఇంటెలిజెన్సు సమాచారము ద్వారా ఏదైనా ఒక ఎన్ బి ఎఫ్ సి ఆర్ బి ఐ నిర్దేశాలను ఉల్లంఘించినట్లు కనపడితే సదరు ఎన్ బి ఎఫ్ సి ని ఆర్ బిఐ ఇక ముందు డిపాజిట్లను పొందకుండా బహిష్కరించవచ్చు మరియు ఆ సంస్థ యొక్క ఆస్తులను విక్రయించకుండా బహిష్కరిస్తుంది. అంతేకాకుండా డిపాజిటర్ కంపెనీ లా బోర్డు ( సి ఎల్ బి) కు ఫిర్యాదు చేసినట్లయితే అది రిపేమెంట్ ఆర్డర్ చేసినా ఒక వేళ ఎన్ బి ఎఫ్ సి ఆ సి ఎల్ బి ఉత్తర్వు ను పాటించనట్లయితే ఆర్ బి ఐ సదరు ఎన్ బి ఎఫ్ సి పై చట్టపరమైన చర్యలను తీసుకొనుటను ప్రారంభిస్తుంది, ఇందులో క్రిమినల్ యాక్షన్ మరియు కంపెనీని మూతవేయుటతో సహా ఉంటాయి.

చాలా ముఖ్యంగా, ఆర్ బి ఐ నిర్ధేశములను / నియమాలను మార్కెట్ ఇంటెల్లిజెన్స్ రిపోర్టులు, ఫిర్యాదులు, కంపెనీల యొక్క ఆడిటర్ల చట్టబద్ధమైన రిపోర్టులు , ఎస్ ఎల్ సిసి సమావేశములు మొదలగువాటి ద్వారా పొందిన సమాచారము ఆధారముగా ఎన్‌బిఎఫ్‌సిలు ఆర్‌బిఐ నిర్దేశాలు/నియమనిబందనలను అనుసరించనట్లు కనపడితే వాటికై జరిమాన విధింపుతో సహా తగు విధమైన చట్టపరమైన చర్యలను ఆర్. బి.ఐ. తీసుకొంటుంది. రిజర్వు బ్యాంక్ వెంటనే సదరు సమాచారమును రాష్ట్ర స్థాయి కో ఆర్డినేషన్ కమిటీలో సభ్యులైన ఆర్థిక రంగ నియంత్రణదారులు మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలకు తెలియప రుస్తుంది.

ఒక విశేషమైన పబ్లిక్ పాలసీ ఇనిస్టిట్యూషన్ లాగా, తన పబ్లిక్ పాలసీ విధానములోని భాగముగా, భారతీయ రిజర్వు బ్యాంక్ ప్రజలలో తమ కష్టార్జిత ధనాన్ని పెట్టుబడి పెట్టే విషయములో తగు విధమైన అవగాహన కల్పించి తగు జాగ్రత్తవహించేలా అనేక చర్యలు చేపట్టటంలో ముందు వరుసలో ఉంటుంది. ఇలాంటి చర్యలలో భాగంగా ప్రింట్ మీడియాలతో ముందు జాగ్రత్త నోటీసులను జారీచేయుట మరియు సరైన సమాచారం విజ్ఞానం పెంచే బ్రోచర్స్, కరపత్రాలు పంపిణి చేయటం, మరియు ప్రజలతో దగ్గరగా మెలుగుతు అవగాహన కల్పించుట మొదలగు కార్యకలాపాలను ఏర్పాటుచేయుట టౌన్‌హాల్ ప్రోగ్రామ్స్, రాష్ట్ర ప్రభుత్వం చేత అనుమతించబడిన ట్రేడ్ ఫేర్ లు మరియు ప్రదర్శనలలో పాల్గొనుట మొదలైనవి ఎన్నో ఆర్‌బిఐ చేపడుతుంది. కొన్ని సార్లు , ఎక్కువ సర్క్యులేషన్ ఉన్న వార్తా పత్రికలను (ఇంగ్లీష్ మరియు ప్రాంతీయ భాషలు) నమోదు చేయబడని సంస్థలు డిపాజిట్ సేకరణకై ఇచ్చే ప్రకటనలకు ఒప్పుకొకుండా కూడా ఆర్‌బిఐ అర్థిస్తుంది.

37. ఆర్థిక సంస్థలలోని డిపాజిటర్ల ప్రయోజనాలను రక్షించుటకు రాష్ట్ర ప్రభుత్వం చేత ఏర్పాటు చేయబడిన చట్టాల యొక్క ప్రయోజనం ఏమిటి ?

ఈ చట్టమును చేయుటకు ముఖ్యమైన ప్రయోజనము డిపాజిటర్ల యొక్క ప్రయోజనాలను రక్షించుట. ఆర్ బి ఐ యాక్టు లోని నియమావళుల ద్వారా ఆర్థిక సంస్థలు చక్కని స్థితిలో వుండేలా ఆర్ బి ఐ తగిన నియమ నిబంధనలను జారీ చేస్తుంది. ఆర్ బి ఐ ఒక సివిల్ బాడీ మరియు ఆర్ బి ఐ యాక్టు కూడా ఒక సివిల్ యాక్టు. చెల్లింపులలో విఫలమైన సంస్థల లేదా వారి యొక్క అధికారుల యొక్క ఆస్తులను అటాచ్‌మెంట్ చేసి విక్రయించుటకు తద్వారా రికవరీ ఏర్పాటుకై ఆర్‌బిఐ కి, ఆర్‌బిఐ చట్టానికి అధికారాలు లేవు. ఒక రాష్ట్ర ప్రభుత్వ వ్యవస్థ మాత్రమే అలాంటి చర్యలు ప్రభావంతంగా నిర్వహించగలదు. సదరు 'ద ప్రొటెక్షన్ ఆఫ్ ఇంట్రస్ట్ ఆఫ్ డిపాజిటర్స్ ఇన్ ఫినాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్' యాక్టు రాష్ట్ర ప్రభుత్వంనకు సదరు తిరిగి చెల్లింపులలో విఫలమైన కంపెనీల, సంస్థల మరియు వారి యొక్క అధికారుల యొక్క ఆస్తులను జప్తుచేసి విక్రయించుటకు తగు విధమైన అధికారములను అందించినది.

38. రాష్ట్ర ప్రభుత్వం చేత ఏర్పాటు చేయబడిన ప్రొటెక్షన్ ఆఫ్ ఇంట్రెస్ట్ ఆఫ్ డిపాజిటర్స్ ఇన్ ఫినాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం నమోదు కాని సంస్థలను అనధికారంగా డిపాజిట్లను స్వీకరించే కంపెనీలను ఆపేందుకు సహకరిస్తుందా?

అవును చాలావరకు. ఈ చట్టం ఏదైనా కంపెనీ లేదా సంస్థ అనధికారికంగా డిపాజిట్లను స్వీకరిస్తే ఆచర్యని కాగ్నిజబుల్ ఆఫెన్సు గా పేర్కొంటుంది. అంటే, ఆ సంస్థ లేదా కంపెనీకి సంబంధించిన వారిని తక్షణమే జైలులో వుంచవచ్చును, వారిపై కోర్టులో చర్య చేపట్ట వచ్చును. ఈ చట్టం క్రింద రాష్ట్ర ప్రభుత్వములకు విస్తృతమైన అధికారములు ఇవ్వబడినది. తద్వారా సదరు డిపాజిటర్ల డిపాజిట్లను తిరిగి చెల్లింపులలో విఫలమైన సంస్థల యొక్క ఆస్తులను జప్తు చేసి ప్రత్యేక కోర్టు ఉత్తర్వుల మేరకు విక్రయించి డిపాజిటర్లకు పంపిణి నిమిత్తం చర్యలు తీసుకోవచ్చును. విశాలమైన చట్టపరిధి చేత రాష్ట్ర ప్రభుత్వం / రాష్ట్ర పోలీసు వ్యవస్థ నేరస్తుల పై త్వరితగతి చర్య తీసుకోగలరు. అందువల్లనే రిజర్వు బ్యాంక్ అన్ని రాష్ట్ర ప్రభుత్వములను ఈ 'ప్రొటెక్షన్ ఆఫ్ ఇంట్రెస్ట్ ఆఫ్ డిపాజిటర్స్ ఇన్ ఫినాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్' యాక్టు శాసనము విడుదల చేయుటకు గాను కోరడమైనది. పదహారు రాష్ట్రములు మరియు 1 కేంద్రపాలిత ప్రాంతము ఈ యొక్క చట్టమును ఇప్పటి వరకు కలిగి ఉన్నవి. ఈ రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, అస్సాం, బీహార్, గోవ, గుజరాత్, హిమాచలప్రదేశ్, కర్నాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర , మిజోరాం, న్యూఢిల్లీ, తమిళనాడు, త్రిపుర, ఉత్తరాంచల్, సిక్కిమ్, మేఘాలయ, జమ్మూ అండ్ కాశ్మీర్ మరియు చండీగర్ పరిపాలనా వ్యవస్థ. కొన్ని రాష్ట్ర ప్రభుత్వములు ఈ యాక్టును డిపాజిటర్ల క్షేమము సంరక్షించుటలో చాలా ప్రభావవంతంగా వినియోగించినవి.

39. ఆర్‌బిఐలో ఫిర్యాదులపరిష్కారానికి ఏదైనా వ్యవస్థ ఉన్నదా ?

ఏదైనా ఎన్ బి ఎఫ్ సి పైన ఫిర్యాదులు లేదా అభ్యర్థనలు వున్నట్లయితే, సమీపములోవున్న రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క ప్రాంతీయ కార్యాలయమునకు తెలియచేయవచ్చు. ఆర్‌బిఐ సదరు సంబంధిత ఎన్ బి ఎఫ్ సితో సదరు అభ్యర్థనలు మరియు ఫిర్యాదులు మీద చర్చలు చేసి తగిన చర్య తీసుకొటుంది.

40. ఇంకా అలాంటి అనైతిక ఆర్థిక సంస్థలు ప్రజలను మళ్లీ మళ్లీ మోసం చేస్తున్నాయి. అనధికారిక డిపాజిట్లను స్వీకరించే కంపెనీలపై గానీ అనధికారిక ఎన్‌బిఎఫ్ఐ వ్యాపారము చేస్తున్న వాటిపై గానీ పర్యవేక్షించుటకు తగు విధంగా బలమైన ప్రణాళికను ఆర్ బి ఐ ఏ విధంగా రూపొందిస్తుంది?

రిజర్వు బ్యాంక్ వివిధ ప్రాంతీయ కార్యాలయములలో వున్న మార్కెట్ ఇంటెలిజెన్స్ విభాగాన్ని ఇంకా బలోపేతం చేస్తోంది. మార్కెట్ ఇంటెలిజెన్స్ ద్వారా సేకరించిన వివరాల ద్వారా మరియు తమకు అందే ఫిర్యాదులకు సంబంధించిన కంపెనీల యొక్క ఆర్థిక సమాచారాన్ని రిజర్వుబ్యాంకు వారు నిరంతరం పరిశీలిస్తున్నారు. ఈ సందర్భముగా ప్రజలు అప్రమత్తంగా ఉండి ఆర్‌బిఐ నిబంధనలను ఉల్లంఘించిన కంపనీల ఆర్థిక లావాదేవీలపై ఆర్.బి.ఐ.కి వెంటనే ఫిర్యాదు చేయడం ద్వారా తమవంతు పాత్రను ఎంతో పోషించినవారు అవుతారు. ఉదాహరణకు ఏదైనా కంపనీలు ఆర్‌బిఐ అనుమతి లేకుండా డిపాజిట్లు స్వీకరించడం మరియు నాన్-బ్యాంకింగ్ కార్యకలాపాలు నిర్వహించడం గురించి తెలిస్తే ప్రజలు ఆర్‌బిఐ కి తెలియజేయాలి. ప్రజలు తమ తెలివితేటలు ఉపయోగించి పెట్టుబడులు పెడితే ఇలాంటి సంస్థలు పనిచేయజాలవు. ప్రజలు ఈ సందర్భంగా తెలుసుకోవలసినదేమంటే పెట్టుబడులపై రాబడులు అధికంగా ఉన్నప్పుడు రిస్కు కూడా అలాగే ఆధికంగా ఉంటుంది అని, పైగా స్పెక్యులేషన్‌లో స్థిరమైన రాబడి అంటూ వుండనే వుండదని కూడా గ్రహించాలి.

## హెచ్. ఉమ్మడి పెట్టుబడి పథకములు ( సి ఐ ఎస్ ) మరియు చిట్ ఫండ్స్

41. ఉమ్మడి పెట్టుబడి పథకము ( సి ఐ ఎస్ )లను భారతీయ రిజర్వు బ్యాంక్ నియంత్రిస్తోందా?

లేదు. సి ఐ ఎస్ పథకములు అంటే యూనిట్ల కోసం డబ్బు ఇవ్వడం జరిగినపుడు. అది రిసార్టులలో టైమ్ షేర్ కావచ్చును, కలప విక్రయమంలో డబ్బు ఇవ్వడం గావచ్చును, అభివృద్ధి చెందిన వ్యాపార ప్లాట్‌లు మరియు బిల్డింగ్‌లు మొదలగునవి విక్రయించుట వలన వచ్చిన లాభము కావచ్చును. ఉమ్మడి పెట్టుబడి పథకములు ( సి ఐ ఎస్ ) రిజర్వు బ్యాంక్ నియంత్రణ క్షేత్రములోనికి రావు.

42. సమిష్టి పెట్టుబడి పథకములను ( సి ఐ ఎస్) లను నియంత్రణ చేయు సంస్థ ఏది?

ఈ సమిష్టి పెట్టుబడి పథకములను నియంత్రించేది స్టాక్ ఎక్స్ఛేంజి బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి). సదరు పథకములు మరియు నిర్వాహకుల పై వచ్చిన ఫిర్యాదులపై సమాచారము వెంటనే సెబికి మరియు ఇ ఓ డబ్ల్యు /రాష్ట్ర ప్రభుత్వ పోలీసు డిపార్టుమెంట్ కు పంపించబడాలి.

43. చిట్‌ఫండ్ వ్యాపారము నిర్వహించుట చట్ట ప్రకారము అనుమతించబడుతుందా ?

చిట్ ఫండ్‌లు చిట్ ఫండ్ యాక్టు, 1982, ఒక రాష్ట్ర ప్రభుత్వము చేత పరిపాలించబడిన కేంద్ర యాక్టు చేత, నిర్వహించబడుతుంది. ఈ యాక్టు క్రింద రిజిస్టరు అయిన చిట్ ఫండ్‌లు చిట్ ఫండ్ వ్యాపారమును చట్టపరంగా నిర్వహించగలవు.

44. ఒక వేళ చిట్ ఫండ్ కంపెనీలు ఆర్థికపరమైన సంస్థలు అయినపుడు అవి ఎందుకు ఆర్ బి ఐ చేత నియంత్రించబడుట లేదు?

చిట్ ఫండ్ కంపెనీలు చిట్ ఫండు యాక్టు , 1982 క్రింద నియంత్రించబడతాయి, అది కేంద్ర ప్రభుత్వ యాక్టు మరియు రాష్ట్ర ప్రభుత్వముల చేత అమలుచేయబడుతుంది. ఆర్‌బిఐ 2009 లో చిట్‌ఫండ్ కంపెనీలు ప్రజలనుండి డిపాజిట్లు స్వీకరించుటను నిషేధించినది. ఒక వేళ ఏదైనా ఒక చిట్ ఫండ్ కంపనీ ప్రజల నుండి డిపాజిట్లను స్వీకరించినపుడు సదరు చిట్ ఫండ్ కంపనీలపై ఆర్ బి ఐ చట్టపరమైన చర్యలను తీసుకొంటుంది.

## ఐ. మనీ సర్క్యులేషన్ / మల్టీ లెవెల్ మార్కెటింగ్ / పోన్జి / నమోదుకాని సంస్థలు (యుఐఎ)

45. మనీ సర్క్యులేషన్ / మల్టీ లెవెల్ మార్కెటింగ్ / పోన్జి / నమోదుకాని సంస్థలు (యుఐఎ) అంటే ఏమిటి ?

మనీ సర్క్యులేషన్, మల్టీ లెవెల్ మార్కెటింగ్ / చైన్ మార్కెటింగ్ లేదా పోన్జి పథకములు ఏమిటంటే ఇవి సభ్యులను చేర్చుట ద్వారా సులభమైన లేదా త్వరితగతిన ధనం లభిస్తుదని హామిని ఇస్తాయి. వివిధ స్థాయిల మార్కెటింగ్ లేదా పిరమిడ్ నిర్మాణ పథకములు క్రింద ఆదాయం ఎక్కువ మందిని ఫీజు తీసుకొని ఎన్‌రోల్ చేసుకొనుట వలన వచ్చినంతగా వారు ఆఫర్ చేసిన ఉత్పత్తులను విక్రయించుట వలన రాదు. ఇది అందరు సభ్యులు ఎక్కువ మొత్తంలో ఎన్‌రోల్ చేసుకొనుట పై ఆధారపడి ఉంటుంది. ప్రతి సభ్యత్వము ద్వారా తీసుకొన్న డబ్బు మొత్తములు పిరమిడ్ పైన గల సభ్యులకే పంపిణి చేయబడుతుంది. చైన్‌ను నిర్వహించుట లో ఏమైన అవరోధం ఏర్పడినట్లయితే మొత్తం పిరమిడ్ పడిపోతుంది మరియు పిరమిడ్ లో క్రింద స్థాయిలో ఉన్న సభ్యులు చాలా వరకు నష్టపోయేలా ప్రభావితం చేయబడతారు. పోన్జి పథకములు అనగా ప్రజల నుండి అధిక మొత్తంలో వడ్డీలను చెల్లిస్తామని చెప్పి డబ్బులను సేకరించుట. ఇక్కడ ఏ ఆస్తులు ఏర్పాటు లేనందున ఒకరినుంచి తీసుకొన్న డబ్బు వేరొకరికి ఫలంగా చెల్లించటం జరుగుతుంది పైగా ఏ ఆధాయ వృద్ధి అనేది లేనందున, ఈ పథకములు సాగించడం కుదరదు. అందులోను వాగ్దానము చేసినట్లుగా డబ్బును ప్రజలకు చెల్లించుట అసంభవము అంతే కాకుండ సేకరించబడిన అసలు మొత్తంను రిటర్న్ చేయుట కూడా అసంభవము. ఈ పథకము ఎలాంటి సందేహం లేకుండా విఫలమై తీరుతుంది, మరియు మోసగాళ్లు డబ్బుతో ఉడాయించుతారు.

46. మనీ సర్క్యులేషన్ / మల్టి లెవల్ మార్కెటింగ్ / పిరమిడ్ స్ట్రక్చర్ పథకముల క్రింద డబ్బును పొందుట అనుమతించబడుతుందా ?

లేదు. మనీ సర్క్యులేషన్ / మల్టి లెవల్ మార్కెటింగ్ / పిరమిడ్ స్ట్రక్చర్ పథకములు, మరియు పోన్జి పథకములు క్రింద డబ్బును సేకరించుట అనుమతించబడదు ఎందుకంటే ఈ విధమైన పథకముల క్రింద పొందిన డబ్బు 'ప్రైజ్ చిట్ అండ్ మనీ సర్క్యులేషన్ (బ్యానింగ్ ) యాక్టు' 1978 క్రింద ఒక కాగ్ని జబుల్ నేరముగా గుర్తించబడుతుంది.

47. మనీ సర్క్యులేషన్ / మల్టి లెవల్ మార్కెటింగ్ / పిరమిడ్ స్ట్రక్చర్ పథకములను ఆర్ బి ఐ నియంత్రిస్తుందా ?

లేదు. ప్రైజ్ చిట్ అండ్ మనీ సర్క్యులేషన్ (బ్యానింగ్ ) యాక్టు, 1978 క్రింద ప్రైజ్ చిట్స్ మరియు మనీ సర్క్యులేషన్ పథకములు రద్దుచేయబడినవి. కేంద్ర ప్రభుత్వం చేత ఈ యాక్టు క్రింద రూల్స్‌ను తయారు చేయుటకు గాను సలహా ఇచ్చి మరియు సహకరించినంత వరకు తప్ప మరేవిధంగానూ ఈ యాక్టును అమలు చేయుటలో ఆర్ బి ఐ యొక్క పాత్ర లేదు.

48. అటువంటపుడు ఈ పథకములను నిర్వహించే సంస్థలను ఎవరు నియంత్రిస్తారు ?

ప్రైజ్ చిట్ అండ్ మనీ సర్క్యులేషన్ (బ్యానింగ్ ) యాక్టు, 1978 క్రింద మనీ సర్క్యులేషన్ / మల్టి లెవల్ మార్కెటింగ్ / పిరమిడ్ స్ట్రక్చర్డ్ పథకములు ఒక నేరము. ఎవరైనా లేదా ఏ వ్యక్తి అయిన ప్రైజ్ చిట్ లేదా మనీ సర్క్యులేషన్ పథకములు నిర్వహించుట లేదా ఈ పథకములలో సభ్యులను చేర్చుకొనుట లేదా ఎవరైనా వ్యక్తి దీనిలో పాల్గొనుట ఈ పథకములో డబ్బును తీసుకొని లేదా డిపాజిట్ చేయటం ఈ చట్టం ద్వారా రద్దుచేయబడినవి. ఈ యాక్టులోని నియమాల ఉల్లంఘన సంబంధించి ఆయా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

49. ఒక వేళ ఎవరైనా ఇలాంటి పథకములను నిర్వహించినట్లయితే ఏమి చేయాలి ?

సదరు పథకములకు సంబందించిన ఏదైనా సమాచారము / అభ్యర్థన తప్పనిసరిగా సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ పోలీసు / (ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ ) ఆర్థిక నేరాల విభాగం లేదా కార్పోరేట్ అఫేర్స్ మంత్రిత్వ శాఖకి తెలియచేయాలి. ఒక వేళ ఆర్ బి ఐ దృష్టికి ఈ విషయాన్ని తీసుకొనివచ్చినట్లయితే ఆర్‌బిఐ దానిని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు అందిస్తుంది.

50. అభ్యర్థన చేయాలంటే డిపాజిటర్ / పెట్టుబడిదారుడు ఎవరికి చేయాలి?

అనుబంధం । మరియు ॥ లో రెండు చార్టులు ఇవ్వబడినాయి. వాటిలో కార్యకలాపాల వివరాలు వాటిని నియంత్రణ చేసే సంస్థల వివరాలు వివరించబడనాయి. ఫిర్యాదులను సంబంధిత నియంత్రణ సంస్థకి

తెలియజేయాలి. ఒక వేళ ఏదైనా కార్యకలాపము రద్దుచేయబడినది అయినట్లయితే బాధితుడు రాష్ట్ర పోలీసు / ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ రాష్ట్ర పోలీసు ను సంప్రదించి తగు విధమైన ఫిర్యాదును చేయవచ్చును.

51. నమోదు కాని సంస్థ (యు ఐ బి)లు డిపాజిట్లు సేకరిస్తే వారి మీద చర్య తీసుకొను అధికారము ఎవరికి కలదు ?

సెక్షన్ 45 టి ఆర్‌బి ఐ యాక్టు, ప్రకారము ఆర్ బి ఐ మరియు రాష్ట్ర ప్రభుత్వములు రెంటికీ ఒకే సమయంలో అధికారములు వున్నాయి. అయితే నేరస్తుని మీద వెంటనే చర్య తీసుకొనేందుకు, సదరు సమాచారము వెంటనే రాష్ట్ర పోలీసుకు లేదా సదరు రాష్ట్ర ఎకనామిక్ ఆఫెన్సెస్ వింగ్‌కు తప్పనిసరిగా అందించవలెను. వారు తగు విధమైన చర్యను వెంటనే తీసుకోగలరు. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం విశాలమైనది అయినందున మరియు రాష్ట్ర ప్రభుత్వం ఆర్ బి ఐ యాక్టు , 1934 నియమాలను అనుసరించి చర్య తీసుకొనుటకు కూడా అధికారములను కలిగి ఉన్నందున సదరు అనధికారిక డిపాజిట్లు పొందుతున్న సమాచారమును వెంటనే సంబంధిత రాష్ట్ర ప్రభుత్వముల పోలీసు డిపార్టుమెంట్లు / ఇ ఓ డబ్లు లకు తెలియజేయాలి.

అనేక రాష్ట్ర ప్రభుత్వములు డిపాజిటర్ల క్షేమముకై 'ది స్టేట్ ప్రొటెక్షన్ ఆఫ్ ఇంట్రెస్ట్స్ ఆఫ్ డిపాజిటర్స్ యాక్టు ఇన్ ఫినాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్' చట్టాని ఏర్పాటు చేసినవి. తద్వారా రాష్ట్ర ప్రభుత్వములు తగు విధమైన మరియు సమయానుకూలంగా చర్యను తీసుకొనుటకు వీలవుతుంది.

సెక్షన్ 45 ఎస్ , ఆర్ బి ఐ యాక్టు 1934, ప్రత్యేకంగా, నమోదు కాని సంస్థలు మరియు వ్యక్తులను, మరియు ఏవైతే ప్రజల నుండి డిపాజిట్లను సేకరిస్తున్న నమోదు కాని సంఘములు ఆర్థిక లావాదేవీలను నిర్వహించు సంస్థలు లేదా వారి యొక్క ప్రధాన వ్యాపారంగా డిపాజిట్లను సేకరిస్తున్న సంస్థలను (ఈ చట్టం) బహిష్కరించినది. ఈ యాక్టు సదరు డిపాజిట్లు స్వీకరిస్తున్న యు ఐ బి లను జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండింటి తో శిక్షించగలదు.

ఆర్ బి ఐ యాక్టు, 1934 రిజర్వు బ్యాంక్ మరియు రాష్ట్ర ప్రభుత్వములకు ఒకే సమయంలో అధికారములను ఇస్తున్నది. తద్వారా కోర్టు ద్వారా తనిఖీ వారెంట్ ను పొంది సదరు డిపాజిట్లు స్వీకరిస్తున్న యు ఐ బి సంస్థలను విచారించి తనిఖీ చేయగలవు.

ఒక రిజర్వు బ్యాంక్ లేదా రాష్ట్ర ప్రభుత్వ అధీకృత అధికారి సదరు అనధికారిక సంస్థలు మరియు వ్యక్తులకు పై సదరు నేరమును చూపుతూ కోర్టు లో ఒక ఫిర్యాదును ఫైల్ చేయవచ్చును.

చార్ట్ – 1

## నాన్ – బ్యాంకింగ్ కంపెనీల నియంత్రణ సంస్థల యొక్క అవలోకనం

కంపెనీలు

(అధినియం 3 కంపెనీల చట్టం 1956 క్రింద రిజిష్టర్ చేయబడినది.)

ఆర్‌బిఐతో రిజిష్టర్డ్ అయిన ఎన్‌బిఎఫ్‌సిలు*.

ఇవి ఆర్‌బిఐ క్రింద నియంత్రణ, పర్యవేక్షణ, మరియు నిఘాలో ఉంటాయి.

ఇతర నియంత్రణ సంస్థలచే నియంత్రింబడే ఎన్ బి ఎఫ్ సిలు

| ఆర్థిక సంస్థలు రకాలు | సూపర్‌విజన్ నిఘా మరియు ఎఫోర్స్‌మెంట్‌లకు నియంత్రణ సంస్థ. |
|---|---|
| హౌసింగ్ ఫైనాన్స్ సూచనలు | జాతీయ గృహ బ్యాంకు |
| మర్చంట్ బ్యాంకింగ్ కంపెనీ, వెంచర్ పెట్టుబడి నిధి సంస్థలు, స్టాక్ బ్రోకింగ్ పెట్టుబడి సమీకరణ పథకాలు (సిఐఎస్) | స్టాక్ ఎక్స్చేంజి బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) |
| నిధి సంస్థలు మ్యూచువల్ ప్రయోజన కంపెనీలు | (యంసిఎ) మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ ఎఫైర్స్ |
| ఛిట్ ఫండ్ కంపెనీలు | రాష్ట్ర ప్రభుత్వం |
| ఇన్సురెన్స్ కంపెనీలు | ఐఆర్‌డిఎ |

నాన్ బ్యాంకింగ్ నాన్–ఫైనాన్సియల్ సంస్థలు

నియంత్రణ: పర్యావేక్షణ మరియు నిఘా కంపెనీల చట్టం 1956 ప్రకారం

నియంత్రణః కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ

ఎన్ఫోర్స్‌మెంట్ ఏజెన్సీ:

రాష్ట్ర ప్రభుత్వాలు

*నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపనీ అనగా రుణమంజూరు, లేక పెట్టుబడులు పెట్టడం ఏదైనా స్కీం కింద లేక ఏర్పాటు ద్వారా డబ్బులను సమీకరించడం వంటి కార్యకలాపాలను నిర్వహిస్తున్న ఆర్థిక సంస్థ. కానీ ఈ క్రింది తరహా కార్యకలాపాలు అవేమంటే వ్యవసాయ కార్యకలాపాలు, పారిశ్రామిక కార్యకలాపాలు, వ్యాపార కార్యకలాపాలు లేక స్థిరాస్తుల అమ్మకాలు/ కొనుగోల్లు, మొదలైన వ్యాపారాలు ప్రధాన వ్యాపారంగా నిర్వహించే కంపనీలు ఈ కోవలోకి రావు. డిపాజిట్ల సేకరణ ప్రధాన వ్యాపారంగా గల కంపనీలు నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థలుగా పిలువబడతాయి.

చార్ట్ –2

## కంపెనీల కంటే ఇతర సంస్థల నియంత్రణల యొక్క అవలోకనం

**కంపెనీల కంటే ఇతర సంస్థల రకాలు**

నమోదు చేయబడని సంస్థలు (యుఐబి) ఎన్‌ఫోర్స్‌మెంట్ రాష్ట్ర ప్రభుత్వాలు

పరిమిత బాధ్యత భాగస్వామ్య సంస్థలు నియంత్రణ పర్యవేక్షలో యం.సి.ఎ.

సహకార సంఘాలు సహకార సంఘాల కో–ఆపరేటివ్ రిజిస్ట్రార్ ద్వారా నియంత్రణ మరియు పర్యవేక్షణ

మల్టీస్టేట్ సహకార సంఘాలు సహకార సంఘాల కో–ఆపరేటివ్ కేంద్రీయ రిజిస్ట్రార్ ద్వారా నియంత్రణ మరియు పర్యవేక్షణ

క్రెడిట్ కో–ఆపరేటివ్స్
వీటి కార్యకలాపాలు సభ్యులకు మాత్రమే పరిమితం
ఆర్‌సిఎస్ వారి నియంత్రణ మరియు పర్యవేక్షణలో

క్రెడిట్ కో–ఆపరేటివ్స్
వీటి కార్యకలాపాలు సభ్యులకు మాత్రమే పరిమితం
సిఆర్‌సిఎస్ వారి నియంత్రణ మరియు పర్యవేక్షణలో
ప్రాథమిక (పట్టణ) సహకార బ్యాంకులు,

ప్రాథమిక (పట్టణ) సహకార బ్యాంకులు, ఆర్‌బిఐ వారి నియంత్రణ మరియు పర్యవేక్షణలో బ్యాంకింగ్ సంభంధిత కార్యకలాపాలు.
నిర్వహణ ఆడిట్, సిబ్బంది వ్యవహారాలు,
రిజిస్ట్రేషన్, లిక్విడేషన్ మొదలగు వ్యవహారాలు
ఆర్‌సిఎస్ వారి నియంత్రణ మరియు పర్యవేక్షణలో

ప్రాథమిక (పట్టణ) సహకార బ్యాంకులు,
బ్యాంకింగ్ నియంత్రణ కార్యక్రమాలు
ఆర్‌బిఐ వారి నియంత్రణలో ఉంటాయి
నిర్వహణ ఆడిట్, సిబ్బంది వ్యవహారాలు,
రిజిస్ట్రేషన్, లిక్విడేషన్ మొదలగు వ్యవహారాలు
సిఆర్‌సిఎస్ వారి నియంత్రణ మరియు చిపర్యవేక్షణలో

రాష్ట్ర మరియు జిల్లా సహకార బ్యాంకులు
బ్యాంకింగ్ నియంత్రణ కార్యక్రమాలు
ఆర్‌బిఐ వారి నియంత్రణలో ఉంటాయి
పర్యవేక్షణః– నాబార్డు వారిచే నిర్వహణ ఆడిట్,
సిబ్బంది వ్యవహారాలు,
రిజిస్ట్రేషన్, లిక్విడేషన్ మొదలగు వ్యవహారాలు
ఆర్‌సిఎస్ వారి నియంత్రణ మరియు పర్యవేక్షణలో